సైనికుల త్యాగాలపై రాజకీయం తగదు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట : దేశరక్షణ కోసం ప్రాణాలర్పించే సైనికుల త్యాగాలను బీజేపీ రాజకీయం చేస్తున్నదని సీపీఐ నాయకులు విమర్శించారు. ప్రధాని మోడీ కాళ్లు మొక్కాలని మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీశ్ వ్యాఖ్యలు చేశారంటూ నిరసనకు దిగారు. జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. పాక్‌తో కాల్పుల విరమణ, ఆపిల్ విస్తరణ ఆపడం, సుంకాల విధింపుపై ట్రంప్ తీరుపై మోడీ స్పందించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉమామహేశ్, హరినాథ్, ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

మియాపూర్ : శేరిలింగంపల్లి మండల పరిధిలోని హఫీజ్‌పేట డివిజన్‌లో సర్వే నం. 79లో ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల సీపీఐ(ఎం) నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. శనివారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శోభన్, మాణిక్యం, కృష్ణ , వరుణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

బాచుపల్లి.. రాజీవ్‌గాంధీ నగర్‌లో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మే 17: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిజాంపేట్ కార్పొరేషన్‌ను మోడల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్, 17వ డివిజన్ కౌసల్య కాలనీ, 18వ సాయి అనురాగ్, 20వ డివిజన్లలోని పూజిత ఎన్‌క్లేవ్‌లలో శనివారం మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీవాసులు, ఆయా ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు, వీధి దీపాల ఏర్పాటు తో పాటు పొల్యూషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్లలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి నిజాంపేట్ కార్పొరేషన్ ను అభివృద్ధి పరచామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధిని చూసి 2023 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజానీకానికి రుణపడి ఉంటానన్నారు. రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, రాఘవేంద్ర రావు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీశ్, మున్సిపల్ డీఈ యూనిస్, ఏఈ ప్రవీణ్, వాటర్‌వర్క్స్ డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ సౌమ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుకృతా రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు అర్చిత , నాయకులు బొర్రా చందు, ప్రదీప్, సాంబశివారెడ్డి, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

దుండిగల్, మే 17 : మెరుగైన మౌలిక వసతుల కల్పనతో కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామనీ బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్, మిథిలా నగర్ లో రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నట్టు తెలిపారు.

కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, శివానాయక్, ఆసిఫ్, ప్రసాద్, మిథిలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేశ్, చైర్మన్ ఠాగూర్, ప్రధాన కార్యదర్శి చెంగల్ రాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కమిటీ సభ్యులు నరసింహ, హన్మంత్ రావు, శ్రవణ్, రామకృష్ణ, శివ, ప్రవీణ్ పోతినేని, కిశోర్, సుధాకర్, వెలగపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిథిలా నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, తదితరులు

ఎలాంటి సమాచారం లేకుండా.. సర్వే చేయడం చట్టవిరుద్ధం

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని తమ భూమిలో ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేయడం చట్టవిరుద్ధమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తుతో సర్వే చేయడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ న్యాయపరంగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేపట్టడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేపట్టే 15 రోజుల ముందు స్థల యజమానికి నోటీసు ఇవ్వాలని కానీ.. పోలీసుల పహరాలో అధికారులు అత్యుత్సాహంగా వ్యవహరించి సర్వే చేపట్టడం సరైంది కాదన్నారు. తాము న్యాయబద్ధంగా సర్వే నం.82, 83 లో కొనుగోలు చేశామని, దీనిపై కొందరు దురుద్దేశపూర్వకంగా వ్యవహరించి చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం సరైనది కాదని హెచ్చరించారు. కాగా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి సర్వే చేపట్టారు.

బాలానగర్ : మూసాపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు భరత్‌నగర్ మార్కెట్లో అక్రమంగా వెలసిన పుట్‌పాత్‌పై దుకాణాలను తొలగించారు. శనివారం భరత్ నగర్ మార్కెట్లో వాహనదారులకు అడ్డుగా నిలిచిన డబ్బాలను తొలగించారు.

చెరువు సుందరీకరణ పనులు పరిశీలన

అల్లాపూర్ : సున్నం చెరువులో హైడ్రా చేపట్టిన చెరువు సుందరీకరణ పనులను శనివారం అల్లాపూర్ కార్పొరేటర్ సబియా బేగం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాలు కరిసేలోపే సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కృష్ణరావు, సంజీవ్ రెడ్డి, జితేందర్, బ్రహ్మం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

కార్యకర్తలతో సమావేశమైన శంభీపూర్ కృష్ణ

దుండిగల్, మే 17 : ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్ లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు శంభీపూర్ కృష్ణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు

భరతనాట్య ప్రదర్శన

కొండాపూర్, మే 17 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్ లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం నాద ముద్ర స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ గురువు చైతన్య కుసుమప్రియ శిష్యబృందం రీతూపర్ణ, లాశ్రిత సాయి, హరిణి, అనన్య, తరిని, నిహారిక, మానస, శ్రీలత, డాక్టర్ ఆనంద్ మీనన్, రమ్య ప్రదీప్ ప్రదర్శించి మెప్పించారు. డాక్టర్ శ్రిష్టి బుధోరి భరతనాట్య ప్రదర్శనలో దశావతరం ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ముగిసిన సమ్మర్ ఆర్ట్ క్యాంప్

కొండాపూర్ : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న సమ్మర్ ఆర్ట్ క్యాంప్ శనివారం ముగిసింది. సమ్మర్ ఆర్ట్ క్యాంపులో 15 రోజులుగా వివిధ కళలలో శిక్షణ పొందిన వారిని శిల్పారామం ప్రత్యేక అధికారి జి .కిషన్‌రావు అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆర్ట్ క్యాంపులో ఇప్పటివరకు నేర్చుకున్న కళలను ప్రదర్శించారు.

22 నుంచి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 17: కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ సర్దార్‌పటేల్ నగర్ లోని శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ నెల 22న గురువారం అంకురార్పణం పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయని, 23న శుక్రవారం ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ ఊరేగింపు, గరికపాటి నరసింహారావు చే ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. అలాగే 24న శనివారం సింహవాహన సేవ, ఊరేగింపు, సర్వభూపాల వాహన సేవ, శ్రీ అకెల్ల విభీషణ శర్మ ప్రవచనాలు ఉంటాయని, 25న ఆదివారం పల్లకీ ఉత్సవం, ఊరేగింపు, గరుడ వాహన సేవ పూజలు, 26న సోమవారం సూర్య ప్రభ వాహనసేవ ఉత్సవమూర్తులకు వసంతోత్సవం గజవాహన సేవ ఊరేగింపు, 27న మంగళవారం చక్రస్నానం, శ్రీరామ్ గణపతి ప్రవచనాలు మహా పూర్ణాహుతి, 28న బుధవారం శ్రీ పుష్ప యాగం, శ్రీవారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఉంటాయని తెలిపారు.

రసాయన ఎరువులు మితంగా వాడాలి

మేడ్చల్‌రూరల్ : రాజబొల్లారం, నూతనకల్, కాజిగూడ, అత్వెల్లి గ్రామాల్లో ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ రసాయనక ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వసంత, పరుశురాం, పుష్పవల్లి సంతోషి, స్వర్ణలత, వరప్రసాద్, సౌమ్య, ఏవో అర్చన, ఏఈవోలు సుమిత, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

'ప్రజా జీవితంలోకి వచ్చి చూడు'

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, మే 17: కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నిద్ర మత్తు వీడి ప్రజా జీవితంలోకి వచ్చి చూడాలని బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ శ్రేణులు సూచించారు. శనివారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌పై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్.ప్రజా ప్రతినిధులు, జీహెచ్ ఎంసీకి చెందిన పలు డివిజన్ల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పత్రికా ప్రకటనలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో డబ్బులకు అమ్ముడుపోయే నీ బాగోతం ఇక్కడి ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది మన్ననలను అందుకున్న మా నాయకుడిని విమర్శించే స్థాయి నీది కాదన్నారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి నీది కాదని, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన చరిత్ర మా నాయకుడిదైతే, లూజర్‌గా పేరుతెచ్చుకున్న చరిత్ర నీదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అనాలోచిత, అరాచక పాలనపై సుప్రీంకోర్ట్ మొట్టికాయలు వేయడంపై ఎమ్మెల్యే అన్నవి వాస్తవం కదా. .? కంచె, గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పాలకులు చేసిన దమనకాండ నిజం కదా .? ఏది నిజం కాదు అని ప్రశ్నించారు. 2018 ఎన్నికల్లో నీవు డబ్బులకు అమ్ముడుపోయింది వాస్తవం కాదా అని గుర్తు చేశారు. సమావేశంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నరేందర్ రెడ్డి, నదీమ్ రాయ్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 17: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 38, బజ్జి మిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 12, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 27, కాలీఫ్లవర్ 23, దొండ 19, చిక్కుడు 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 43, ఆలుగడ్డ 24, కీరా 18, దోసకాయ 23, సోరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 95, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 18, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9నుంచి 11, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 25, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు (12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆలయాభివృద్ధి పనులకు విరాళం

మాదాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాభివృద్ధి పనులకు హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ రూ.36 వేల నగదును అందచేశారు. శనివారం ఫౌండేషన్ కార్యాలయంలో బిగ్‌బాస్ రియాల్టీ షో ఫేం జెస్సీ జశ్వంత్ ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. జశ్వంత్ మాట్లాడుతూ.. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో మహేశ్ కుర్ర, ఫౌండేషన్ సభ్యులు రవికుమార్, ఆపర్ణ, ఆలయ కమిటీ సభ్యులు అనంతరాం, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

రూ.36 వేలు విరాళం అందజేస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్‌కుమార్

వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు

మియాపూర్ : శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం భవ్యాస్ తుల సీవనంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుచున్నాయి. నాలుగవ రోజు శనివారం మోహిని పల్లకీ ఉత్సవం , అన్న కూటోత్సవం తోమాల సేవ , కొలువు, అర్చన, ఉంజల్ సేవ, శ్రీవారి గరుడవాహనోత్సవం జరిగాయి. బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి ఆగమ పండితులచే ఆనంద ప్రసాద్, కృష్ణకుమారి దంపతుల ఆధ్వర్యంలో భక్తి ప్రపత్తులతో జరుగుతున్నాయి.

సామూహిక ఉపనయనాలు

అల్లాపూర్ : మోతీ నగర్ బ్రాహ్మణ అభ్యుదయ సమితి, శ్రీ శృంగేరి శారద పీఠం ఆధ్వర్యంలో శనివారం ఉచిత సామూహిక ఉపనయన కార్యక్రమం జరిగింది. 10 మంది బ్రాహ్మణ వటువులకు ఉపనయనం చేయగా.. దీక్షావస్త్రాలు,అవసరమైన పూజ సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమం ఉచిత భోజన ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో మోతీ నగర్ బ్రాహ్మణ అభ్యుదయ సమితి అధ్యక్షురాలు జయలక్ష్మి, శ్రీ రామచంద్ర రావు, అనిత , శంకరనారాయణ, కోడి కిరణ్ బాబు, వేద రాజు సుబ్బారావు, శ్రీ చంద్ర, రామేష్ అయ్యాంగార్, సుధాకర్, కార్యవర్గ ప్రధాన సభ్యులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామని, మెమోను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 26 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఈవినింగ్ ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఈవినింగ్ ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్) (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను www. osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షల ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, హెచ్ఐ, ఎల్డీ, ఏఎస్డీ) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని పేర్కొన్నారు. రూ.200 అపరాధ రుసుంతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, శ్రీ యల్ల లోవ సతీష్ తండ్రి యల్ల ఆది నారాయణ, నివాసం: ఇం.నెం.6-181, మావులమ్మ వీధి, ఇందుపల్లి, ఈస్ట్ గోదావరి జిల్లా, ఆం.ప్ర.-533221 వారు దగవ తెలిపిన ఆస్తిని అమీర్‌పేట్, హైదరాబాద్ వద్ద ఒక కార్యాలయం కలిగిన నాక్షయుంట్ గృహం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున తనఖా పెట్టాలని ఉద్దేశిస్తున్నారు.
శ్రీ యల్ల లోవ సతీష్ సదరు షెడ్యూల్ ఆస్తికి అసలు యజమాని మరియు స్వాధీనదారు, దానిని అతను DAGPA హోల్డర్ శ్రీ U.V.R.బోస్‌వే ప్రాతినిధ్యం వహించిన 1.శ్రీమతి పద్మజ, 2. శ్రీమతి గార్లపాటి పున్నమ్మ, 3. శ్రీ వల్లభనేని ప్రమీళాదేవీ, 4. శ్రీ వల్లభనేని S.V.V. ప్రసాద రెడ్డి వారిచే ఎగ్జిక్యూట్ చేయబడిన 10.02.2022 తేదీనాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.4615/2022 ద్వారా కొనుగోలు చేసినారు.
సదరు భూమి యజమానులు 1.శ్రీమతి పద్మజ, 2. శ్రీమతి గార్లపాటి పున్నమ్మ, 3. శ్రీ వల్లభనేని ప్రమీళాదేవీ, 4. శ్రీ వల్లభనేని S.V.V. ప్రసాద రెడ్డి వారు ప్లాట్ నెం.9 మరియు 10 యావత్తు డెవలప్‌మెంట్ కొరకు శ్రీ U.V.R.బోస్ పేరున 03.01.2020 తేదీనాటి డాక్యుమెంట్ నెం.177/2020 కలిగిన రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ GPA ఎగ్జిక్యూట్ చేశారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. సదరు డాక్యుమెంట్ తరువాత అన్ని పార్టీలు అన్ రిజిస్టర్డ్ సప్లిమెంటరీ పేరింగ్ అగ్రిమెంట్ ఎగ్జిక్యూట్ చేశారు, అందులో షెడ్యూల్‌లో తెలిపిన ఆస్తి డెవలపర్ శ్రీ U.V.R.బోస్ వాటాకు వెళుతుంది. దీనికి సంబంధించి సదరు యజమానులందరూ షెడ్యూల్ ఆస్తిపై ఏవిధమైన హక్కులు లేదా క్లెయింలు లేవని తెలియజేస్తూ 17.05.2015 తేదీనాటి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (NOC) జారీచేశారు.
ఏవేని క్లెయింలు/అభ్యంతరాలు మొదలగునవి ఉన్నచో వారు ఈ నోటీస్ ప్రచురణ తేదీనుండి 7 రోజులలోగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ తెలిపిన చిరునామాలో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును. ఎలాంటి అభ్యంతరాలు అందనిచో నా క్లయింట్ తదుపరిగా ముందుకు సాగుతారు మరియు సదరు ఆస్తిపై ఏవిధమైన క్లెయింలు, అభ్యంతరాలు లేవని భావించి తనఖాను అంగీకరిస్తారు. ఆతరువాత ఎలాంటి క్లెయింలు అనుమతించబడవు.
ఆస్తి షెడ్యూల్: ప్రశాంతి పార్కవెజ్, బాచుపల్లి గ్రామం మరియు మండలం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వద్ద గల ట్రినిటి సర్వే నెం.లు. 147, 148, 156/పార్ట్, 161 మరియు 180A లో బ్లాక్ నెం.180, ప్లాట్ నెం.9 మరియు 10ఎ (533.32 చ.గజాలలో) 29 చ.గజాల విస్తీర్ణం భూమి అవిభాజ్య వాటాతో సహా, 100 చ.అ. కార్ పార్కింగ్ ఏరియా, 1000 చ.అ. బిల్టప్ ఏరియా (800 చ.అ.కార్పెట్ ఏరియా+ 200 చ.అ.కామన్ ఏరియా)తో (నాలుగవ అంతస్తులో) సగంపూర్తయిన ఫ్లాట్ నెం.305 యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పడమర: ఖాళీ.
సం/- ఇ.ఎ. శ్రీకాంత్ రాజు L.L.M, అడ్వకేట్
కార్యాలయం: 202, 2వ అంతస్తు, సరళ అపార్ట్‌మెంట్స్, యాక్సిస్ బ్యాంక్ ప్రక్కన, ఉమేశ్‌చంద్ర విగ్రహం రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-38
నివాసం: విల్లా నెం.33, సెరెన్ కౌంటీ, శ్రీరాం నగర్, సుచిత్ర సర్కిల్ సమీపాన, హైదరాబాద్, తెలంగాణ-67